ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్
EVENING 6 PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 294 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 + https:www.prajarepublic.com + వెల - 1/-
సోమవారం 26 మే 2025
RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

వన్ నేషన్-వన్ ఎలక్షన్ ఆచరణ సాధ్యమే:పవన్ కల్యాణ్

వన్ నేషన్-వన్ ఎలక్షన్ దేశానికి అవసరమైన మార్పు అని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు.

చెన్నై, మే 26, (రిపబ్లిక్ న్యూస్): 'వన్ నేషన్-వన్ ఎలక్షన్' దేశానికి అవసరమైన మార్పు అని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. భారత్కున్న సామర్థ్యం రీత్యా ఇది ఆచరణ సాధ్యమేనని చెప్పారు. చెన్నైలో 'వన్ నేషన్-వన్ ఎలక్షన్'పై నిర్వహించిన సెమినార్లో ఆయన మాట్లాడారు.

"మనసు ఉంటే మార్గం ఉంటుంది. ముందు ప్రారంభిస్తే.. మార్గంలో వచ్చే అడ్డంకులు అధిగమించొచ్చు. సమస్యలు లేవని చెప్పను.. కానీ వాటిని అధిగమించగలం. ఈవీంఎలపై ఆరోపణలు అర్థ రహితం. 2019లో అవే ఈవీఎంలతో వైకాపా గెలిచింది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా కూటమి గెలవబోతోంది. మోదీ దేశాన్ని ముందుకు తీసుకెళ్లే నాయకుడు. ఆయన నాయకత్వంలో అభివృద్ధి పరుగులు పెడుతోంది" అని పవన్ కల్యాణ్ తెలిపారు.

రాజస్థాన్ కోటాలో మరో నీట్ విద్యార్థి ఆత్మహత్య

రాజస్థాన్‌లోని కోటాలో నీట్‌కు సన్నద్ధమవుతున్న మరో విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది.

కోటా, మే 26, (రిపబ్లిక్ న్యూస్): పోటీ పరీక్షల శిక్షణకు ప్రసిద్ధి చెందిన రాజస్థాన్‌లోని కోటాలో విద్యార్థుల ఆత్మహత్యలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా నీట్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న 18 ఏళ్ల విద్యార్థిని బలవన్మరణానికి పాల్పడింది. 2025లో ఇది 15వ ఘటన కాగా.. ఈ నెలలోనే రెండో ఆత్మహత్య. పోలీసుల కథనం ప్రకారం.. జమ్మూ కశ్మీర్కు చెందిన 18 ఏళ్ల విద్యార్థిని జీషాన్ నెల క్రితం కోటాకు వచ్చి.. ప్రతాప్ చౌరాహా ప్రాంతంలో పేయింగ్ గెస్ట్‌గా ఉంటూ నీటు సిద్ధమవుతోంది.

ఆదివారం సాయంత్రం ఆమె తన కుటుంబసభ్యులతో ఫోన్లో మాట్లాడింది. తరవాత వారు తిరిగి ఎన్నిసార్లు ఫోన్ చేసినప్పటికీ స్పందించకపోవడంతో విద్యార్థి స్నేహితురాలికి కాల్ చేశారు. ఆమె జీషాన్ గది వద్దకు వెళ్లగా లోపలి నుంచి గడియ వేసి ఉండడంతో.. ఇతరుల సాయంతో తలుపులు పగలగొట్టారు. అక్కడ సదరు విద్యార్థిని ఉరి వేసుకొని ఉండడంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఆమె అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మధ్యప్రదేశ్కు చెందిన మరో నీట్ అభ్యర్థి మే 3న తన గదిలో ఆత్మహత్యలు చేసుకుంది. ఇటీవల విద్యార్థుల బలవన్మరణాల కేసుపై విచారణ జరిపిన సుప్రీం కోర్టు కోటాలోని పరిస్థితిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. అక్కడే విద్యార్థులు ఎందుకు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు?, 'రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తోంది. ఈ విషయంపై ఎందుకు ఆలోచించడం లేదు? అని న్యాయస్థానం ప్రశ్నించింది. ఈ ఏడాది ఇప్పటికే 14 మంది విద్యార్థులు బలవంతంగా ప్రాణాలు తీసుకోవడాన్ని తీవ్రంగా పరిగణించిన సుప్రీంకోర్టు.. రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తోందంటూ నిలదీసింది. ఎఫ్ఐఆర్ నమోదులో పోలీసుల వైఖరిని తప్పుపట్టింది.

పార పట్టి మహానాడు పనుల్లో పాల్గొన్న మంత్రి నిమ్మల రామానాయుడు

రాష్ట్రానికి మంత్రి అయినా పార్టీకి మాత్రం కార్యకర్తనే అంటూ నిమ్మల రామానాయుడు మహానాడు పనుల్లో స్వయంగా పాల్గొన్నారు.

కడప, మే 26, (రిపబ్లిక్ న్యూస్): రాష్ట్రానికి మంత్రి అయినా పార్టీకి మాత్రం కార్యకర్తనే అంటూ నిమ్మల రామానాయుడు మహానాడు పనుల్లో స్వయంగా పాల్గొన్నారు. మహానాడు సభా ప్రాంగణ కమిటీ కన్వీనర్‌గా ఉన్న ఆయన.. వర్షం వల్ల సభా ప్రాంగణంలోకి నీళ్లు రావడంతో స్వయంగా రంగంలోకి దిగారు.

పార పట్టి దగ్గరుండి సభా ప్రాంగణాన్ని చదును చేశారు. కడప వేదికగా తెదేపా మహానాడు సంబరం మంగళవారం ప్రారంభమవుతోంది. తెదేపా చరిత్రలో తొలిసారిగా వైఎస్సార్ కడప జిల్లాలో జరుగుతున్న కార్యక్రమానికి ఏర్పాట్లన్నీ దాదాపు పూర్తి కావొచ్చాయి. తెదేపా అధినేత, సీఎం చంద్రబాబు సోమవారం సాయంత్రం ఇక్కడికి రానున్నారు. అంతకుముందే పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ కుప్పం నుంచి కడపకు చేరుకోనున్నారు. ఇప్పటికే మంత్రులంతా తరలివచ్చారు. పార్టీ తోరణాలు, కటౌట్లు, ఫ్లెక్సీలతో మహానాడు ప్రాంగణం, కడప, కమలాపురం నియోజకవర్గాలు పసుపుమయమయ్యాయి. నగర శివార్లలో ఉన్న కమలాపురం నియోజకవర్గం పబ్బాపురం సమీపంలోని 150 ఎకరాల విస్తీర్ణంలో మహానాడు నిర్వహించనున్నారు.

ఓఎంసీ కేసు.. గాలి జనార్దన్ రెడ్డి, మరో ముగ్గురి బెయిల్ పిటిషన్లపై సీబీఐ కౌంటర్

ఓబుళాపురం అక్రమ మైనింగ్ కేసులో నిందితులైన గాలి జనార్దన్ రెడ్డి, మరో ముగ్గురి బెయిల్ పిటిషన్లపై సీబీఐ కౌంటర్ దాఖలు చేసింది.

హైదరాబాద్, మే 26, (రిపబ్లిక్ న్యూస్): ఓబుళాపురం అక్రమ మైనింగ్ కేసులో నిందితులైన గాలి జనార్దన్ రెడ్డి, మరో ముగ్గురి బెయిల్ పిటిషన్లపై సీబీఐ కౌంటర్ దాఖలు చేసింది. నలుగురికి బెయిల్ ఇవ్వొద్దంటూ అందులో పేర్కొంది. ఓబులాపురం మైనింగ్ కేసులో సీబీఐ కోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ హైకోర్టులో గాలి జనార్దన్రెడ్డి, పీవీ శ్రీనివాస్, రాజగోపాల్, అలీఖాన్ పిటిషన్లు దాఖలు చేశారు. సీబీఐ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను పిటిషనర్లు సవాల్ చేశారు. న్యాయస్థానం యాంత్రికంగా తీర్పు వెలువరించిందని పేర్కొన్నారు.

ఈక్రమంలో సీబీఐ ఈ పిటిషన్లపై కౌంటర్ దాఖలు చేసింది. ఓబులాపురం మైనింగ్ కేసులో ఈ నలుగురిని సీబీఐ కోర్టు దోషులుగా చేర్చి జైలు శిక్ష విధించిన విషయం తెలిసిందే. వీరు ప్రస్తుతం చంచల్గూడ జైలులో ఖైదీలుగా ఉన్నారు.

గ్రామ దేవత ఉత్సవాల్లో తెగిపడిన విద్యుత్ వైర్లు.. ముగ్గురి మృతి

శ్రీకాకుళం జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది.

కంచిలి, మే 26, (రిపబ్లిక్ న్యూస్): శ్రీకాకుళం జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది. కంచిలి మండలం తలతంపరలో గ్రామ దేవత ఉత్సవాల్లో విద్యుత్ తీగలు తెగిపడి ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందారు. మరొ ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వీరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.

మూడో రోజు దిల్లీ పర్యటనలో సీఎం రేవంత్.. నేడు మరోసారి కేసీ వేణుగోపాల్‌తో భేటీ!

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ దిల్లీ పర్యటన మూడో రోజు కొనసాగుతోంది.

దిల్లీ, మే 26, (రిపబ్లిక్ న్యూస్): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ దిల్లీ పర్యటన మూడో రోజు కొనసాగుతోంది. ఆదివారం సాయంత్రం కాంగ్రెస్ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ని వీరు కలిశారు.

సుమారు గంట పాటు చర్చలు జరిపారు. పీసీసీ కార్యవర్గం కూర్పుపై చర్చించినట్లు సమాచారం. ఇవాళ మరోసారి కేసీ వేణుగోపాల్తో ఇరువురు నేతలు భేటీ కానున్నారు. అనంతరం రాహుల్ గాంధీని కలవనున్నారు. పీసీసీ కార్యవర్గ కూర్పుపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. బీసీల రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ తెలంగాణ శాసనసభలో ఆమోదించిన బిల్లును కేంద్రానికి పంపిన నేపథ్యంలో రాష్ట్రానికి చెందిన బీసీ మంత్రులు, ఎమ్మెల్యేలు సోమవారం దిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో సామాజిక న్యాయసదస్సు నిర్వహించబోతున్నారు. ఇందులో ముఖ్యమంత్రి పాల్గొనే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

రైతుల ఆదాయం పెంచి గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమే లక్ష్యం:చంద్రబాబు

కుప్పంలో పారిశ్రామిక యూనిట్లను స్థాపించడానికి కంపెనీలకు భూమి కేటాయించినట్లు సీఎం చంద్రబాబు తెలిపారు.



కుప్పం, మే 26, (రిపబ్లిక్ న్యూస్): కుప్పంలో పారిశ్రామిక యూనిట్లను స్థాపించడానికి కంపెనీలకు భూమి కేటాయించినట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. కుప్పంలో శ్రీజ మిల్క్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్, మదర్ డెయిరీ ప్రతినిధులు సీఎంతో భేటీ అయ్యారు. స్వర్ణాంధ్ర దార్శనికతకు అనుగుణంగా, జీరో పేదరికాన్ని సాధించడానికి పెట్టుబడి ప్రణాళికలపై చర్చించామని చంద్రబాబు వెల్లడించారు. శ్రీజ మిల్క్ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ పశుగ్రాస ప్రాసెసింగ్ యూనిట్ను.. మదర్ డెయిరీ పండ్ల గుజ్జు ప్రాసెసింగ్ యూనిట్ను ఏర్పాటు చేస్తుందని తెలిపారు. రైతుల ఆదాయం పెంచి గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమే లక్ష్యమని సీఎం వెల్లడించారు.

యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాకు పాక్‌లో ఏకే 47లతో భద్రత!

గూఢచర్యం ఆరోపణలతో అరెస్టైన యూట్యూబర్ జ్యోతి పాకిస్థాన్లో పర్యటించిన సమయంలోని మరో వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

దిల్లీ, మే 26, (రిపబ్లిక్ న్యూస్): పాకిస్థాన్‌కు గూఢచర్యం చేస్తూ అరెస్టయిన హరియాణా యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా పై దర్యాప్తు కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఓ స్కాటిష్ యూట్యూబర్ తీసిన వీడియోలో జ్యోతి మల్హోత్రాకు సంబంధిన చిత్రాలు సోషల్ మీడియాలో వైరల్గా మారాయి. ఆమె పాకిస్థాన్లో పర్యటించిన సమయంలో స్కాటిష్ యూట్యూబర్ క్యాలమ్ మిల్ సైతం తన పర్యటనలో భాగంగా పలు వీడియోలు చిత్రీకరించి సోషల్ మీడియాలో అప్లోడ్ చేశారు. వాటిలోని ఓ వీడియోలో లాహోర్లోని అనార్కలి బజార్లో జ్యోతి వీడియోలు తీస్తూ క్యాలమ్ మిల్కు ఎదురు పడ్డారు. అతడు జ్యోతిని పలకరిస్తూ.. తాను స్కాటిష్ యూట్యూబర్గా పరిచయం చేసుకున్నాడు. తాను భారత్ నుంచి వచ్చానని జ్యోతి సమాధానం చెప్తూ.. 'మొదటి సారి పాక్కు వచ్చారా' అని అతడిని ప్రశ్నించింది. ఇప్పటి వరకు ఐదుసార్లు వచ్చినట్లు అతడు చెప్పాడు. పాకిస్థాన్ ఆతిథ్యం గురించి మిల్ ఆమె అభిప్రాయాన్ని అడగగా.. చాలా బాగుందని సమాధానం ఇచ్చింది. అనంతరం అమె వెళ్తుండగా.. ఆరుగురు వ్యక్తులు సాధారణ దుస్తుల్లో ఏకే 47 తుపాకీలతో జ్యోతికి భద్రత కల్పిస్తున్నట్లు గుర్తించిన మిల్ వారి ఆయుధాలను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వారు ధరించిన జాకెట్లపై "నో ఫియర్" అని రాసి ఉన్నట్లు వీడియోలో కనిపించింది. ఆమెకు అన్ని తుపాకులతో భద్రత కల్పించాల్సిన అవసరం ఏముంది అంటూ అతడు తన అభిమానులను ఉద్దేశించి ప్రశ్నించాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. వీడియోలో ఆమె చుట్టూ మరికొంతమంది పర్యాటకులు ఉండడంతో సాయుధులు ఆమెకు మాత్రమే భద్రత కల్పించారా? లేదా? ఆమెతో ఉన్న బృందం మొత్తానికీ భద్రత కల్పించారా అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. గూఢచర్యం కేసుకు సంబంధించి జరుగుతున్న దర్యాప్తులో.. పాక్ ఇంటెలిజెన్స్ అధికారులతో తనకు సంబంధాలున్నట్లు జ్యోతి మల్హోత్రా అంగీకరించినట్లు అధికారులు పేర్కొన్నారు. పాక్ హైకమిషన్లో పనిచేసే దానిష్తో తాను నిత్యం టచ్లో ఉండేదాన్నని పేర్కొంది. 2023లో వీసా కోసం పాక్ హైకమిషన్కు వెళ్లిన సమయంలో తొలిసారి దానిష్ పరిచయం అయ్యాడని ఆమె వెల్లడించింది. ఆపరేషన్ సిందూర్ సమయంలో కూడా జ్యోతి పాక్కు సమాచారం చేరవేసినట్లు అనుమానిస్తున్నారు. పాక్ హైకమిషన్ కార్యాలయానికి వీసా కోసం వచ్చే వారిని ట్రాప్ చేసి వారిని దానిష్ గూఢచర్యానికి వాడుకొనేవాడని.. యూట్యూబర్ జ్యోతి కూడా వీసా కోసం వెళ్లగా ఆమెను ట్రాప్ చేశాడని అధికారులు పేర్కొన్నారు.

'నైరుతి' ఎఫెక్ట్.. కేరళలో రెడ్ అలర్ట్.. ముంబయిని ముంచెత్తిన వాన

కేరళలోకి రుతుపవనాల రాకతో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పలు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ అయింది.

మే 26, (రిపబ్లిక్ న్యూస్): నైరుతి రుతుపవనాలు సాధారణం కంటే ముందుగానే కేరళను పలకరించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఆ రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈదురుగాలులు ఆదివారం బీభత్సం సృష్టించాయి. దీంతో వయనాడ్లోని కొన్ని ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఫలితంగా రాష్ట్రంలోని 11 జిల్లాలకు ఐఎండీ రెడ్ అలర్ట్ జారీ అయింది.

మరో వైపు మహారాష్ట్రలోని ముంబయిలో కూడా అదే పరిస్థితి నెలకొంది. సోమవారం ప్రజలను ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. దాంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పలు ప్రాంతాల్లో సబర్బన్ రైలు సర్వీసులపై ప్రభావం పడింది. అటు విమానాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఎయిర్ ఇండియా సహా పలు ఎయిర్లైన్లు ట్రావెల్ అడ్వైజరీని జారీ చేసింది. సమాచారం కోసం అధికారిక వెబ్సైట్లో వివరాలను పరిశీలించాలని సూచించాయి. దాదార్, మహిమ్, పరెల్, బాంద్రా, కాలాచౌకీతో పాటు ఇతర ప్రాంతాలకు ఐఎండీ ఎల్లో హెచ్చరికలు విడుదల చేసింది. అలాగే దిల్లీలో ఆరెంజ్ అలర్ట్ జారీ అయింది. శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు ఎడతెరిపిలేకుండా కురిసిన వానతో పలు చోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. చెట్లు, విద్యుత్తు స్తంభాలు నేలకొరిగాయి. ఢిల్లీ కంటోన్మెంట్, ధౌలా కువాన్, సుభ్రోతో పార్క్, నానక్ పురాలు నీట మునిగాయి. విమానాల రాకపోకలపై కూడా ప్రభావం పడింది. చెట్టుపడి బాలుడి మృతి.. ఈ భారీ వానల కారణంగా తమిళనాడులోని ఊటీలో ఆదివారం ఒక బాలుడిపై చెట్టుపడటంతో ప్రాణాలు కోల్పోయాడు. ఇక, కర్ణాటకలో బెళగావి జిల్లాలో గోడకూలి నిద్రలోనే మూడేళ్ల బాలిక మృతి చెందింది. ఈ రాష్ట్రంలోనూ పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

చరిత్రలో నేటి ప్రత్యేకత

- 1894 : రష్యా జార్‌గా రెండవ జాన్ నికోలస్ నియమించబడ్డాడు.
- 1942 : భారత ఆధ్యాత్మిక వేత్త గణపతి సచ్చిదానంద స్వామి జననం.
- 1949 : మొట్టమొదట వికీపీడియాను అభివృద్ధి చేసిన అమెరికన్ కంప్యూటర్ ప్రోగ్రామర్ వార్డ్ కన్నింగ్‌హామ్ జననం. (చిత్రంలో)
- 1945 : భారత రాజకీయవేత్త విలాస్‌రావ్ దేశ్‌ముఖ్ జననం. (మ. 2012).
- 1956 : తెలుగు భాషాభిమాని మండలి బుద్ధ ప్రసాద్ జననం.
- 1969 : చంద్రుని పైకి పంపిన వ్యోమనౌక అపోలో 10 తన ఎనిమిది రోజుల యాత్ర అనంతరం భూమిని చేరింది.
- 1972 : అమెరికా, సోవియట్ యూనియన్‌లు క్షిపణి వ్యతిరేక ఒప్పందం పై సంతకాలు చేశాయి.
- 2014 : భారతదేశ 14వ ప్రధానిగా నరేంద్ర మోడీ ప్రమాణ స్వీకారం.


రెండవ జాన్ నికోలస్

గణపతి సచ్చిదానంద స్వామి

వార్డ్ కన్నింగ్‌హామ్


విలాస్‌రావ్ దేశ్‌ముఖ్

బుద్ధ ప్రసాద్


అపోలో 10

బాలిస్టిక్ నిరోధక క్షిపణి

నరేంద్ర మోడీ

అందుకే 'భైరవం' కాస్త ఆలస్యమైంది: నారా రోహిత్

'భైరవం' మే 30న విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించారు.

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, నారా రోహిత్, మంచు మనోజ్ నటించిన సినిమా 'భైరవం'. అదితి శంకర్, ఆనంది, దివ్య పిళ్లై తదితరులు కీలక పాత్రలు పోషించారు. విజయ్ కనకమేడల దర్శకత్వం వహించిన ఈ సినిమా మే30వ తేదీన విడుదల కానుండటంతో.. ప్రీ రిలీజ్ను నిర్వహించారు. అందులో దర్శకుడు, నటీనటులు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఈ సినిమా చూశాక కచ్చితంగా అందరికీ గూస్బంప్స్ వస్తాయని దర్శకుడు విజయ్ కనకమేడల తెలిపారు. సినిమా విడుదల తర్వాత గ్రాండ్ సక్సెస్ మీట్ నిర్వహిస్తామని చెప్పారు. చిత్రబృందానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. "ఈ ప్రీరిలీజ్ను చాలా గ్రాండ్గా చేయాలనుకున్నాం. కానీ, కొన్ని కారణాల వల్ల కుదర్లేదు. చిత్రం ఫైనల్ కట్ చూశాను. చాలా బాగా వచ్చింది. మే 30న అందరికీ పండగ రోజు. మీ అందరి ఆదరాభిమానాలు మాపై ఉండాలి" అని సాయి శ్రీనివాస్ కోరారు. నారా రోహిత్ మాట్లాడుతూ.. "మనోజ్, సాయి శ్రీనివాస్ తో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోవడం నాకెంతో ప్రత్యేకం. అనుకున్న సమయానికి సినిమాను విడుదల చేయాలని విజయ్ ఎంతో కష్టపడ్డారు. భవిష్యత్తులో ఆయన గొప్ప దర్శకుడు అవుతారు. ఈ సినిమా ఆలస్యం కావడానికి మా ఇంట్లో జరిగిన ఒక దురదృష్టకర సంఘటనే కారణం. ఆ సమయంలో చిత్ర బృందం ఎంతో సపోర్ట్ చేసింది" అంటూ భావోద్వేగానికి గురయ్యారు.

జయం రవితో రిలేషన్..! అత్యాచార బెదిరింపులపై చట్టపరమైన చర్యలకు సిద్ధమైన కెనీషా..

తనను బెదిరిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి గాయని కెనీషా సిద్ధమయ్యారు. ఈ విషయాన్ని తెలుపుతూ ఇన్స్టాలో పోస్ట్ పెట్టారు.

నటుడు జయం రవి, గాయని కెనీషా రిలేషన్‌లో ఉన్నట్లు ఎంతోకాలంగా ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తనకు గుర్తుతెలియని వ్యక్తుల నుంచి అత్యాచార బెదిరింపులు వస్తున్నాయంటూ కెనీషా ఇటీవల సోషల్ మీడియాలో ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా అలాంటి సందేశాలు పంపుతున్న వారిపై చట్టపరమైన చర్యలకు సిద్ధమైనట్లు ఆమె టీమ్ తెలిపింది. కెనీషా పరువుకు భంగం కలిగించేలా సందేశాలు పంపినా, బెదిరించినా.. అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె టీమ్ పేర్కొంది. ఇన్స్టాలో వచ్చే అసభ్యకరమైన, అశ్లీల సందేశాల వల్ల ఆమె మానసికంగా కుంగిపోతున్నట్లు తెలిపింది. అలాంటి మెసేజ్లు పంపితే ఆ స్క్రీన్షాట్లను ఆధారంగా చేసుకొని నోటీసులు పంపుతామని వెల్లడించింది. ఇలాంటి పనులు ఆపకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటా అని హెచ్చరిస్తూ పంపే నోటీసులను గాయని తన ఇన్స్టాలో షేర్ చేశారు. తనను కొందరు వేధిస్తున్నారంటూ కెనీషా ఇటీవల సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. ఆ సందేశాల స్క్రీన్ షాట్లను పంచుకుంటూ.. తప్పు చేస్తే శిక్ష అనుభవించడానికి సిద్ధంగా ఉన్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలోనే నిజం బయటపడాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. తప్పు చేస్తే.. చట్టం వేసే శిక్షను అనుభవించడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. అప్పటి వరకూ తనను ద్వేషించొద్దని.. ప్రశాంతంగా బతకనివ్వాలని పోస్టులో రాసుకొచ్చారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

ఓటీటీలోకి 'రెట్రో'.. అధికారికంగా ప్రకటించిన సంస్థ

సూర్య నటించిన తాజా చిత్రం 'రెట్రో'. ఈ సినిమా ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది.

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య ప్రధానపాత్రలో నటించిన చిత్రం 'రెట్రో'. కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో రొమాంటిక్ యాక్షన్ ఫిల్మ్ గా రూపొందిన ఈ సినిమా ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. మే 31 నుంచి నెటిక్స్ వేదికగా అందుబాటులోకి రానుంది. గత కొన్నిరోజులుగా ఈ సినిమా ఓటీటీ విడుదలపై వార్తలు వచ్చినప్పటికీ తాజాగా నెటిక్స్ అధికారికంగా తేదీని ప్రకటించింది. సూర్య సరసన పూజా హెగ్డే నటించిన ఈ సినిమాలో జయరామ్, నాజర్, ప్రకాశ్ రాజ్ కీలకపాత్రల్లో కనిపించారు. కథేంటంటే..: పారి అలియాస్ పార్వేల్ కన్నన్ (సూర్య) చిన్నతనంలోనే పుట్టిన ఊరికి.. తల్లిదండ్రులకు దూరమవుతాడు. ఎవరూ లేని అనాథగా ఉన్న అతన్ని గ్యాంగ్స్టర్ తిలక్ (జోజు జార్జ్) తనకి ఇష్టం లేకున్నా భార్య కోరిక మేరకు దత్తత తీసుకుంటాడు. ఓ సందర్భంలో తిలక్ను శత్రువుల మట్టుపెట్టేందుకు ప్రయత్నించగా.. ఆ ప్రమాదం నుంచి పారి అతన్ని కాపాడి నిజమైన కొడుకుగా అతని మనసులో స్థానం సంపాదించుకుంటాడు. అలా.. తిలక్ నీడలోనే మరో శక్తిమంతమైన గ్యాంగ్స్టర్గా ఎదుగుతాడు. అయితే రుక్మిణి (పూజా హెగ్డే)ని ప్రేమించి పెళ్లి చేసుకున్నాక హింసాత్మక జీవితానికి ముగింపు పలకాలని నిర్ణయించుకుంటాడు. హింసను వదిలేసి భార్య రుక్మిణితో కలిసి ప్రశాంతంగా జీవించాలనుకున్న పారి తాను అనుకున్నది సాధించాడా? అతని గతం.. దాంట్లో దాగున్న రహస్యాలేంటి? అన్నది చిత్ర కథ.

రిపబ్లిక్ దినపత్రిక
9948814188, 9985876888

ప్రకటన

ప్రజా సమస్యల పై అనునిత్యం ప్రజా గళాన్ని అక్షర సత్యాలతో కూడిన సంచలన వరుస కథనాలను అందిస్తూ దూసుకెళ్తున్న ప్రజా రిపబ్లిక్ దినపత్రికకు రెండు తెలుగు రాష్ట్రాలలో తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ జిల్లాలలో, నియోజకవర్గాలలో స్టాప్ రిపోర్టర్లు, పాత్రికేయులు, మండలాల నందు పాత్రికేయులు కావలెను. ప్రజల పక్షాన నిలుస్తూ సమస్యల పరిష్కారానికి అక్షర పోరాటం చేయడానికి మాతో కలిసి పని చేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులు కర్నూలు మరియు నంద్యాలలోని మా కార్యాలయముల నందు లేదా ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

ప్రజా రిపబ్లిక్ దినపత్రిక కార్యాలయం, షాప్ నెం: 26, మొదటి అంతస్తు, శ్రీనివాస కాంప్లెక్స్, శ్రీనిధి టిఫిన్ సెంటర్ ఎదురుగా, నంద్యాల - 518501

డోర్ నెం:46/181/జి-1, మనోజ్ టాలెంట్ స్కూల్ దగ్గర, బుధవార పేట, కర్నూలు - 518001

బొజ్జ నాగేంద్ర
ఎడిటర్ & మేనేజింగ్ డైరెక్టర్

రిపబ్లిక్ స్పోర్ట్స్

కెప్టెన్‌గా నీ ప్రవర్తనే ఇప్పుడు చాలా ముఖ్యం : గిల్‌కు గావస్కర్ సూచన

కెప్టెన్‌గా గిల్ పై ఇప్పుడు బాధ్యత పెరిగిందని గావస్కర్ అన్నాడు.

ఈ సమయంలో అతడి ప్రవర్తనే చాలా కీలకమని అభిప్రాయపడ్డాడు.



టెస్టు ఫార్మాట్కు రోహిత్ శర్మ రిటైర్మెంట్ ప్రకటించడంతో కెప్టెన్సీ పగ్గాలు అందుకున్నాడు యువ ఆటగాడు శుభ్మన్ గిల్. అతడి నాయకత్వంలో ఇంగ్లాండ్ టూరు వెళ్లే జట్టును ఇటీవల బీసీసీఐ ప్రకటించింది. దీనిపై టీమ్ ఇండియా మాజీ కెప్టెన్ సునీల్ గావస్కర్ స్పందిస్తూ.. కొత్త సారథికి కీలక సూచన చేశాడు. ఇప్పుడు గిల్ ప్రవర్తనే చాలా కీలకమన్నాడు. "భారత కెప్టెన్గా ఎన్నికైన ఆటగాడిపై సహజంగానే ఒత్తిడి పెరుగుతుంది. జట్టులో సభ్యుడిగా కొనసాగటానికి, కెప్టెన్గా వ్యవహరించడానికి మధ్య చాలా వ్యత్యాసం ఉంటుంది. ఎందుకంటే.. జట్టులో సభ్యుడిగా ఉన్నప్పుడు నీకు సన్నిహితంగా ఉండే తోటి ఆటగాళ్లతో ముచ్చటిస్తూనే ఉంటావు. కానీ, సారథిగా బాధ్యతలు అందుకున్న తర్వాత.. మిగిలిన వారిని గౌరవించేలా నీ ప్రవర్తన ఉండాలి. కెప్టెన్‌ను ఎప్పుడైనా తన ఆటతీరు కంటే ప్రవర్తనే చాలా ముఖ్యం" అని గావస్కర్ సూచించాడు. కెప్టెన్సీపై గిల్ స్పందిస్తూ.. విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ, అశ్విన్పై ప్రశంసలు కురిపించిన సంగతి తెలిసిందే. "రోహిత్, విరాట్, అశ్విన్ విదేశాల్లో ఎలా ఆడాలి.. సిరీస్లు ఎలా గెలవాలో చూపించారు. వీరి స్ఫూర్తితోనే ముందుకు సాగుతా" అని అన్నాడు. జూన్ 20 నుంచి ఇంగ్లాండ్, భారత్ మధ్య ఐదు టెస్టుల సిరీస్ జరగనుంది. దీనికి గిల్ సారథిగా ఎంపిక కాగా.. మరో యువ ఆటగాడు రిషభ్ పంత్కు వైస్ కెప్టెన్ బాధ్యతలు అప్పగించారు. మొత్తం 18 మందితో శనివారం బీసీసీఐ టెస్టు జట్టును ప్రకటించారు. ఐపీఎల్లో అదరగొడుతున్న సాయి సుదర్శన్ సహా కొందరు యువ ఆటగాళ్లు ఇంగ్లాండ్ సిరీస్కు జట్టులో చోటు దక్కించుకున్నారు.

ఇంటి చిట్కాలు

షుగర్ కంట్రోల్ చేసే టమాటా జ్యూస్, ఎక్స్ పర్ట్ చెప్పినట్టు తయారు చేసుకుని తాగితే 3 నెలల్లోనే రిజల్ట్

షుగర్ తగ్గించడంలోనూ టమాటా చాలా బాగా పని చేస్తుందని చెబుతున్నారు నేచురోపతి ఎక్స్ పర్ట్. సరైన విధంగా తీసుకుంటే చాలా తక్కువ రోజుల్లోనే డయాబెటిస్ కంట్రోల్ అవుతుందని, షుగర్ బార్డర్ లో ఉన్న వారికీ ఇది మంచి ఔషధం అని వివరించారు.

టమాట లేకుండా మన ఇళ్లలో వంటలు వండటం చాలా అరుదు. ఏ కూర చేసినా సరే. అందులో ఒకటో రెండో టమాటాలు తప్పనిసరిగా వేస్తారు. అంతగా వాటికి అలవాటు పడిపోయాం. అయితే..ఇలా కేవలం కూరల్లోనే కాదు. వేరే విధంగా తీసుకున్నా టమాటాతో ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయి. అందులో ఉండే పోషకాలు ఆరోగ్యాన్ని అందిస్తాయి. అయితే..షుగర్ తగ్గించడంలోనూ టమాటా చాలా బాగా పని చేస్తుందని చెబుతున్నారు నేచురోపతి ఎక్స్ పర్ట్. సరైన విధంగా తీసుకుంటే చాలా తక్కువ రోజుల్లోనే డయాబెటిస్ కంట్రోల్ అవుతుందని, షుగర్ బార్డర్ లో ఉన్న వారికీ ఇది మంచి ఔషధం అని వివరించారు. ఇందులో పుష్కలంగా యాంటీ ఆక్సిడెంట్స్ ఉంటాయి. వీటితో పాటు విటమిన్స్, మినరల్స్, ఫైబర్ ఉంటాయి. వీటన్నింటితో పాటు షుగర్ ని తగ్గించే గుణాలు టమాటాలో ఉండడం వల్ల డయాబెటిక్ పేషెంట్స్ ఇది రెగ్యులర్ గా తీసుకోవాలని సూచిస్తున్నారు నేచురోపతి ఎక్స్ పర్ట్. అయితే..షుగర్ కంట్రోల్ కావాలంటే టమాటాని ఎలా వాడాలో కూడా వివరించారు. ఈ ఎక్స్ పర్ట్ చెప్పినట్టుగా తయారు చేసుకుని తాగితే షుగర్ కంట్రోల్ లోకి వచ్చేస్తుంది.

టమాటా జ్యూస్

సాధారణంగా టమాటాలను మనం కూరల్లో వేసి తినేస్తుంటాం. కానీ..షుగర్ తగ్గాలంటే మాత్రం ఇలా కాదు. నేరుగా జ్యూస్ రూపంలోనే తీసుకోవాలి. జ్యూస్ అంటే..నేరుగా టమాటాలను కట్ చేసి మిక్సీ పట్టి తాగేయడం కాకుండా ఓ స్పెషల్ రెసిపీ చెప్పారు నేచురోపతి ఎక్స్ పర్ట్. ఎన్నో రోజులుగా షుగర్ లెవెల్స్ కంట్రోల్ అవ్వక ఇబ్బందులు పడుతున్న వాళ్లు ఇప్పుడు చెప్పిన విధంగా టమాటా జ్యూస్ చేసుకుని రెగ్యులర్ గా తాగితే చాలా తొందర్లోనే ఫలితాలు కనిపిస్తాయి. అయితే..జ్యూస్ చేసుకునే క్రమంలో మాత్రం కొన్ని టిప్స్ కచ్చితంగా ఫాలో అవ్వాల్సి ఉంటుంది.

ఎలా తయారు చేసుకోవాలి

ముందుగా మూడు టమాటాలు తీసుకోవాలి. వాటిని బాగా శుభ్రం చేయాలి. గిన్నెలో నీళ్లు పోసి ఈ మూడు టమాటాలు అందులో వేయాలి. అవి మెత్తగా అయ్యేంత వరకూ ఉడికించాలి. ఆ తరవాత టమాటాపై ఉండే పొట్టుని తొలగించాలి. ఈ సమయంలోనే మరో పని కూడా చేయాలి. టమాటాలో ఉండే గింజల్ని పూర్తిగా తీసేయాలి. చెంచాతో వీటిని తొలగించాలి. ఆ తరవాత ఉడికిన టమాటాలను బాగా గ్రైండ్ చేసుకోవాలి. తాగేందుకు అనువుగా ఉండేలా జ్యూస్ లా చేయాలి.

ఎప్పుడు తాగాలి



ఇప్పుడు తయారు చేసుకున్న జ్యూస్ లో కాస్తంత పిప్పి ఉంటుంది. ముందుగా ఈ పల్ప్ ని ఫిల్టర్ చేసుకోవాలి. ఆ తరవాతే అది తాగడానికి రెడీ అయిపోతుంది. ఇలా రెగ్యులర్ గా తయారు చేసుకుని కనీసం 90 రోజుల పాటు తాగాలి. అయితే ఎప్పుడు పడితే అప్పుడు తాగితే పెద్దగా ప్రయోజనం ఉండదు. సరిగ్గా మీరు భోజనం చేయడానికి ఓ పావుగంట ముందు జ్యూస్ తీసుకోవాలి. మూడు నెలల పాటు ఇది కంటిన్యూ చేస్తే షుగర్ లెవెల్స్ చాలా వరకూ కంట్రోల్ అయిపోతాయి. భోజనం ముందే ఈ జ్యూస్ తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర పెరగకుండా అడ్డుకుంటుంది. తద్వారా షుగర్ లెవెల్స్ ఎప్పుడూ నార్మల్ రేంజ్ లోనే ఉంటాయి.

ఇలా కూడా చేసుకోవచ్చు

టమాటాలను ఉడకబెట్టి జ్యూస్ చేసుకోవడం ఓ పద్ధతి. అయితే..ఇలా బాయిల్ చేయకున్నా నేరుగా కూడా తీసుకోవచ్చు. రెండు టమాటాలను కట్ చేసుకోవాలి. అందులో ఉన్న గింజలను పూర్తిగా తొలగించాలి. ఆ తరవాత ఆ ముక్కలను మిక్సీలో వేసుకుని బాగా గ్రైండ్ చేయాలి. తరవాత పల్ప్ ని ఫిల్టర్ చేయాలి. అందులో కొన్ని నీళ్లు పోసి బాగా మిక్స్ చేయాలి. ఈ జ్యూస్ ని మూడు నెలల పాటు రోజూ ఉదయం తీసుకుంటే షుగర్ లెవెల్స్ తగ్గిపోతాయి.

టమాటాతో ఎన్నో లాభాలు



టమాటాలో యాంటీ ఆక్సిడెంట్స్ అధికంగా ఉంటాయి. ఇవి శరీరంలోని టాక్సిన్స్ ని బయటకు పంపేస్తాయి. దీంతో పాటు విటమిన్ సి, విటమిన్ ఎ ఉంటాయి. విటమిన్ ఎ కంటి చూపుని మెరుగు పరుస్తుంది. విటమిన్ సి రోగనిరోధక శక్తిని పెంచుతుంది. చర్మ ఆరోగ్యాన్ని కూడా కాపాడుతుంది. అందుకే..టమాటా జ్యూస్ ని ముఖానికి అప్లై చేసుకుంటే మంచిదని బ్యూటీ ఎక్స్ పర్ట్స్ చెబుతుంటారు. ఇందులో ఉండే లైకోపీన్ బాడీని ఫ్రీ రాడికల్స్ నుంచి రక్షిస్తుంది. పైగా ఫైబర్, పొటాషియ ఉండడం వల్ల జీర్ణ శక్తి మెరుగు పడడంతో పాటు గుండె కూడా ఆరోగ్యంగా ఉంటుంది. టమాటాల్లో కేలరీలు చాలా తక్కువగా ఉంటాయి. అందుకే చాలా మంది వెజిటబుల్ సలాడ్స్ లో వీటిని చేర్చుకుంటారు. బరువు తగ్గాలనుకునే వాళ్లు టమాటాలు తీసుకుంటే ఆహారం సులువుగా జీర్ణం అవడంతో పాటు త్వరగా వెయిట్ లాస్ అవుతారు.

గమనిక: ఇది సాధారణ సమాచారం కోసం మాత్రమే. ఇది ఏ విధంగానూ ఏ మెడిసిన్ లేదా చికిత్సకు ప్రత్యామ్నాయం కాదు. వీటిని పాటించేముందు మరింత సమాచారం కోసం ఎల్లప్పుడూ మీ వైద్యుడిని సంప్రదించండి. తెలుగు సమయం ఈ విషయాల్ని ధృవీకరించడం లేదు. ఖచ్చితత్వం, ప్రభావానికి తెలుగు సమయం బాధ్యత వహించదు